క్లుప్తంగా

ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట



జంగాలపల్లిలో కందకాలు తవ్వుతున్న పొక్లెయిన్

మాకవరపాలెం: ఇసుక అక్రమ తవ్వకాలకు పోలీసులు అడ్డుకట్ట వేశారు. జంగాలపల్లిలో సర్పానదిని ఆనుకున్న భూముల్లో ఇసుక అక్రమ తవ్వకాలపై పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఇసుక తవ్వకాలు చేపడుతున్న ప్రాంతాలకు ఎలాంటి వాహనాలు వెళ్లకుండా జేసీబీతో కందకాలు తవ్వించినట్టు ఎస్ఐ రామకృష్ణారావు సోమవారం తెలిపారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

నేడు జిల్లా స్థాయి ఎడ్ల, గుర్రపు పందేలు

మాడుగుల రూరల్: వీరనారాయణంలో భక్తాంజనేయ తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు, గుర్రపు పందేలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేస్తామని వారు తెలిపారు.

నియోజకవర్గ అధ్యక్షుడిగా కర్రి మల్లేశ్వరావు

మాడుగుల రూరల్: అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్‌కు ప్రభుత్వం రూ.5 వేల కోట్లు కేటాయించాలని జిల్లా అధ్యక్షుడు పెమ్మే భాస్కరవర్మ కోరారు. ముకుందపురంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నామినేటెడ్ పోస్టులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టిక్కెట్లను జనాభా ప్రాతిపదికపై ఇవ్వాలన్నారు. జాతీయ అధ్యక్షుడు నాగిడి సాంబశివరావు అధ్యక్షతన ఆదివారం విజయవాడలో అగ్నికుల క్షత్రియ జాతీయ కార్యవర్గ సమావేశం జరిగిందన్నారు. ఇందులో భాగంగా జిల్లా ఉపాధ్యక్షుడిగా గేదెల చిన అప్పలరాజు, మాడుగుల నియోజకవర్గ అధ్యక్షుడిగా కర్రి మల్లేశ్వరావులను ఎన్నుకున్నారన్నారు. సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాతా సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మోదకొండమ్మ తీర్థం



మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ తీర్థం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు నేల వేషాలు, విద్యుత్ లైటింగ్ నడుమ అమ్మవారి తీర్థం జరగనుందన్నారు.

సత్యవరంలో మొల్లకు ఘన నివాళి



పుస్తకాలు అందజేస్తున్న రమణబాబు

మాడుగుల: సత్యవరంలో సహజ పండితురాలు కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమ్మరి శాలివాహన సంఘం మండల అధ్యక్షుడు వొమమ్మి రమణబాబు మాట్లాడుతూ మొట్ట మొదటిగా తెలుగులో రామాయణం, తదితర మహా గ్రంథాలు రచించిందని కొనియాడారు. ప్రతి విద్యార్థి కవయిత్రి మొల్లను ఆదర్శంగా తీసుకుని ఉన్నత చదువులు చదవాలన్నారు. అంతకు ముందు మొల్ల విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం 50 మంది పేద విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఎంపీటీసీ తలారి అప్పారావు, సర్పంచ్ జెర్రిపోతుల నాగమణి, ఉప సర్పంచ్ వి. పెంటయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు జనపరెడ్డి అప్పారావు, శనివాడ వెంకటరమణ, కుల పెద్దలు కరకపాటి నూకరాజు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

కోటవురట్ల : కొత్త అమావాస్య పండగను పురస్కరించుకుని కె.వెంకటాపురంలో సోమవారం మండల స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు గొల్లు చిట్టిబాబు రిబ్బన్ కత్తిరించి టోర్నీ ప్రారంభించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

పోలింగ్ ప్రశాంతం

- ఉదయం నుంచి మందకొడిగా నమోదు
- మధ్యాహ్నం నుంచి జోరందుకున్న వైనం
- ఎండను సైతం లెక్క చెయ్యకుండా ఓటర్ల బారులు
- రాత్రి 10 గంటల వరకు ఓటు వినియోగం

చెదురు, మదురు సంఘటనల మినహా ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్దకు పట్టభద్రులు చేరుకున్నారు. ఎండను సైతం లెక్క చేయకుండా గంటలకొద్దీ నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నం నుంచి జోరందుకుంది. దాంతో రాత్రి 10 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది.



నర్సీపట్నం: సిరా గుర్తు చూపుతున్న డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత, సన్యాసిపాత్రుడు





సిరా గుర్తు చూపిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి, బుచ్చెయ్యపేట వైస్ ఎంపీపీ దొండా లలిత



బుచ్చెయ్యపేట: సాయంత్రం ఐదున్నర గంటలకు బారులు తీరిన పట్టభద్రులు

నర్సీపట్నం: టౌన్, రూరల్ మండలానికి సంబంధించి పట్టణంలోని ఐదు రోడ్ల జంక్షన్ వద్ద జెడ్పీ హైస్కూల్‌లో నాలుగు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో 1,100 నుంచి వెయ్యి వరకు ఓట్లు ఉండటం వల్ల పెద్ద ఎత్తున ఓటర్లు తీరాల్సి వచ్చింది. పోలింగ్ సమయం 4 గంటలకు ముగిసినప్పటికీ ఓటర్లు క్యూలో ఉండడంతో రాత్రి వరకు కొనసాగింది. ఉదయం 9 గంటలకు 3.6 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 28 శాతం, రాత్రి 8 గంటలకు 71.2 శాతం నమోదైంది. 4019 ఓట్లకుగాను 2,863 ఓట్లు పోలయ్యాయి. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సాధారణ పౌరుడిగా గంటన్నరకు పైగా క్యూలో నిల్చొని 173 పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత, సన్యాసిపాత్రుడు 175 కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి ఓటు వేశారు.

నాతవరంలో 75.45 శాతం

నాతవరం: అసెంబ్లీ ఎన్నికలు తలపించేలా ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. మండలంలో మొత్తం 1,571 ఓట్లకుగాను రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం తీవ్రమైన ఎండలోనూ ఓటర్లు గంటల తరబడి నిరీక్షణ చేశారు, 177 పోలింగ్ బూత్‌లో 568 మంది, 178లో 608 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ డి. లక్ష్మీనారాయణ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మాకవరపాలెంలో 78 శాతం పోలింగ్

మాకవరపాలెం: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 78 శాతం పోలింగ్ నమోదైంది. సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1,485 ఓటర్లకుగాను ఉదయం 8 నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు సాగిన పోలింగ్‌లో 1,158 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కేంద్రాలను అనకాపల్లి అదనపు ఎస్పీ పి.సత్యనారాయణరావు, ఇన్‌చార్జి సీఐ లక్ష్మి పరిశీలించారు. పోలింగ్ సరళిపై నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు.

రాత్రి వరకూ క్యూ కట్టిన ఓటర్లు

గొలుగొండ: మండలంలో ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ రాత్రి 7.30 గంటలకు 74.03 శాతం నమోదైంది. సాయంత్రం నాలుగు గంటల వరకు వచ్చిన మరో 174 ఓట్లు వేసేందుకు చీకటి పడినా వేచి ఉన్నారు. పోలింగ్ సిబ్బంది పనితీరు వల్లే పూర్తి కాలేదని ఓటర్లు ఆరోపించారు. రాత్రి 10 గంటలైనా వీరంతా ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు లైట్లు, తదితర ఏర్పాట్లు చేశారు. మండలంలో 1,060 ఓట్లకు ఒకటే పోలింగ్ కేంద్రం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మొత్తంగా 782 ఓట్లు పోలయ్యాయి.

అదనంగా టేబుళ్ల ఏర్పాటుతో..

చోడవరం: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ రాత్రి 9 గంటల వరకు కొనసాగింది. స్థానిక మెయిన్ యూపీ స్కూల్‌లో 169, 170 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద పట్టభద్రులైన ఓటర్లు బారులు తీరారు. మధ్యాహ్నం 12.30 గంటలకు 14 శాతం మాత్రమే పోలింగ్ నమోదు కావడంతో తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్ ఉన్నతాధికారులకు విషయాన్ని చెప్పడంతో అదనపు టేబుళ్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. హుటాహుటిన 169, 170 కేంద్రాల్లో అదనంగా రెండు టేబుళ్లు చొప్పున ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి పోలింగ్ ప్రక్రియ వేగంగా సాగింది. రాత్రి 9 గంటలకు 169 బూత్‌లో 1,356గాను 861 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోవడంతో 63 శాతంగా నమోదైంది. 170 బూత్‌లో 1,366 మందికిగాను 916 మంది ఓట్లు వేయగా, 67.5 శాతంగా నమోదైంది. పోలింగ్ ప్రక్రియ మందకొడిగా సాగడంతో చాలామంది ఓటర్లు గంటల కొద్దీ క్యూలో నిలబడలేక సాయంత్రం ఓటు వేయకుండానే వెనుదిరిగారు. మొత్తం 2722 ఓట్లకుగాను 1,777 ఓట్లు పోలయ్యాయి. 65.28 శాతం పోలింగ్ నమోదైంది. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు 170 పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

బుచ్చెయ్యపేటలో రాత్రి 10 గంటల వరకు ..

బుచ్చెయ్యపేట: మండలంలో ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. సాయంత్రం 4 గంటల తర్వాత వచ్చిన ఓటర్లను ఎస్ఐ కుమారస్వామి పోలింగ్ కేంద్రంలోకి అనుమతించకపోవడంతో కొంతమంది గొడవకు దిగారు. మండలంలో 1,065 ఓట్లకుగాను 752 ఓట్లు పోలయ్యాయి. 70.6 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ సరళిని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ డి. నాగేశ్వరిదేవి, డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్ధనరావులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ అంబేడ్కర్, జోనల్ అధికారి జీఎస్ఎన్ మూర్తి ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

అదనంగా ఏర్పాటు

రావికమతం: స్థానిక పోలింగ్ బూత్‌లో పోలింగ్ చాలా మందకొడిగా సాగింది. 167 ఒకటే బూత్ కావడం, ఆపై 1,298 ఓటర్లు ఉండటంతో ఓటర్లు బారులు తీరారు. ఉదయం7 గంటలకే గ్రాడ్యుయేట్లు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున రావడంతో ఆది నుంచీ భారీ క్యూలైన్ కొనసాగింది. దీంతో ఎండలో ఉండలేక వెనుతిరిగేందుకు సిద్ధపడటంతో తహసీల్దార్ మహేశ్వరరావు చొరవ చూపి రెండో బూత్ ఏర్పాటు చేయడంతో మధ్యాహ్నం నుంచి కాస్త జోరు పెరిగింది. మొత్తం 1,298 ఓటర్లకుగానూ ఉదయం 11 గంటలకు 162 ఓట్లు, మధ్యాహ్నం 12.30 గంటలకు 232 ఓట్లు, ఒంటి గంటకు 315 ఓట్లు, 3 గంటలకు 509 ఓట్లు, రాత్రి 8.20 గంటలకు 992 ఓట్లు పోలయ్యాయి. 76.42 శాతం ఓటింగ్ నమోదైంది. కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహమ్మద్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

గర్భిణులతోపాటు బాలింతలు రాక..

రోలుగుంట: స్థానిక ఎంపీపీ పాఠశాల 116 పోలింగు కేంద్రంలో ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగింది. మండలంలో 1,038 మంది ఓటర్లకుగాను సాయంత్రం 4 గంటలకు 649 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆ తర్వాత ఎన్నికల అధికారిగా వ్యవహరించిన తహసీల్దార్ ఆదేశాల మేరకు ఎస్సై నాగకార్తీక్ గేట్లకు లాక్ వేయించారు. ఆ సమయంలో కేంద్రం ఆవరణలో ఓటర్లకు మాత్రమే ప్రొసీడింగ్ అధికారి ధనలక్ష్మి స్లిప్‌లు ఇచ్చి ఓటేసేందుకు అనుమతించారు. ఆఖరి ఓటు 06:25 గంటలకు వినియోగించుకోవడంతో పోలింగ్ ముగిసింది. 807 ఓట్లు పోలయ్యాయి. గర్భిణులతోపాటు బాలింతలు శిశువులతో వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అసిస్టెంటు ప్రొసీడింగు అధికారిగా రామశ్వరరావు, ఓపీవోలుగా సోమేశ్రి, నాగేశ్వరరావు, వెబ్‌కౌన్సిల్‌గా అనిత విధులు నిర్వహించారు. ఏ విధమైన అల్లర్లు జరగకుండా కొత్తకోట సీఐ ఇలియాస్ మహమ్మద్ బందోబస్తు పర్యవేక్షించారు.

73 శాతం నమోదు

మాడుగుల: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోని 159, 160 కేంద్రాల్లో 1,506 ఓట్లకుగాను 1,102 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎండను సైతం లెక్క చెయ్యకుండా ఓటర్లు బారులు తీరారు. 73 శాతం మేర పోలింగ్ నమోదైందని జోనల్ అధికారి వేణుగోపాలరావు తెలిపారు. వీరిలో 804 మంది పురుషులు, 298 మంది మహిళలు ఉన్నారు. సీఐ టి. శ్రీను, ఎస్ఐ పి. దామోదర్‌నాయుడుల పర్యవేక్షణలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. తహసీల్దారు పి.వి.రత్నం, ఉప తహసీల్దారు పి. సత్యనారాయణ, ఎన్నికల సీనియర్ సహాయకుడు వి. పూర్ణయ్య సారథ్యంలో ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా పోలింగ్ సరళిని పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఉరుకూటి అప్పారావు, ఎంపీపీ వేమవరపు రామధర్మజ, పార్టీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, శానాపతి కొండలరావు, వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మలను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు అడిగి తెలుసుకున్నారు.

దేవరాపల్లిలో 77.33 శాతం..

దేవరాపల్లి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లోని 156, 157 పోలింగ్ కేంద్రాల్లో 77.33 శాతం పోలింగ్ నమోదైంది. 1,518 ఓట్లకుగాను 1,174 ఓట్లు పోలయ్యాయి. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా, మధ్యాహ్నం వరకు మందకొడిగా సాగింది. మధ్యాహ్నం నుంచి జోరందుకుంది. పట్టభద్రులైన దివ్యాంగులు, వృద్ధులు, బాలింతలు చంటి పిల్లలను ఎత్తుకుని మరీ ఉత్సాహంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇతర ప్రాంతాల్లోని ఓటర్లను సైతం రప్పించడంతో పోలింగ్ శాతం పెరగడానికి కారణంగా స్థానిక ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. సీఐ ఎస్. తాతారావు, ఎస్ఐ డి.నాగేంద్ర పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కె.కోటపాడులో 77.00 శాతం

కె.కోటపాడు: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 171, 172 పోలింగ్ కేంద్రాల్లో 77.00 శాతం పోలింగ్ నమోదైంది. 1,676 మంది ఓటర్లకుగాను 1,293 ఓట్లు పోలయ్యాయి. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. చిన్నారులతో కలిసి వారి తల్లులు ఓటుహక్కును వినియోగించుకునేందుకు వచ్చారు. అంధత్వ ఉపాధ్యాయుడు సహాయకుడితో కలిసి వచ్చి ఓటు వేశారు. ఎన్నికల కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్‌ను ఎస్ఐ ధనుంజయ్ అమలు చేశారు. ఎన్నికల సరళిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ వివరించారు.

చీడికాడలో 75.81 శాతం..

చీడికాడ: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 158, 158ఏ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 1,410 మందికిగాను 1,096 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు – 808, స్త్రీలు – 294 మంది ఉన్నట్లు తహసీల్దార్ బి.వి. రాణి తెలిపారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ మేరకు స్థానిక పార్టీ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులను కలిసి ఓటింగ్ తీరుపై ఆరా తీసి ఉత్తేజ పరిచారు.



రోలుగుంట: నెల బాబుతో వచ్చిన ఓటరు గురించి తెలుసుకుంటున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు



నర్సీపట్నం: ఇరువర్గాలను చెదరగొడుతున్న పోలీసులు



మాకవరపాలెంలో సాయంత్రం ఐదు గంటలు దాటే వరకు క్యూలో పట్టభద్రులు



నాతవరం: పోలింగ్ కేంద్రం వద్ద ఎండలో నిల్చొన్న ఓటర్లు



దేవరాపల్లిలో విక్టరీ సింబల్ చూపిస్తున్న పట్టభద్రులైన ఓటర్లు



మాడుగుల: నాయకులుతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు



నర్సీపట్నం: ఓటు వేసిన తర్వాత సిరా గుర్తు చూపుతున్న ఎమ్మెల్యే గణేష్



బుచ్చెయ్యపేట: పోలింగ్ సరళిపై పార్టీ నేతలతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



రోలుగుంట: నాలుగు గంటలకు ప్రవేశం ద్వారాన్ని లాక్ చేయిస్తున్న తహసీల్దార్



మాడుగుల: పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



బుచ్చెయ్యపేట: సాయంత్రం 4 గంటల తర్వాత అనుమతించకపోవడంపై ఎస్ఐతో ఓటర్ల వాగ్వాదం



కె.కోటపాడు: పాపను ఎత్తుకుని ఓటు వేసేందుకు క్యూలైన్‌లో పట్టభద్రురాలు

నేడు గంగ పరదేశమ్మ తల్లి పండగ



వాలకాలు ప్రదర్శన

మునగపాక : గవర్ల అనకాపల్లిలో మంగళవారం గంగ పరదేశమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ మళ్ల ఈశ్వరరావు తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా ఆదివారం రాత్రి గ్రామంలో ఏర్పాటు చేసిన వాలకాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పెళ్లిగోల(ఇద్దరు పెళ్లాల ముద్దుల మొగుడు), నూకాలమ్మ అమ్మవారి చీరల అమ్మకం వంటి వాటిపై వాలకాలు నిర్వహించారు. ఆళ్ల రమణావు, శివాజీ, మహేష్, రాజు తదితరుల ఆధ్వర్యంలో ఈ వాలకాల కార్యక్రమం నిర్వహించారు. వాలకాలను తిలకించేందుకు గ్రామస్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ ఈశ్వరరావు తెలిపారు. గ్రామస్తుల సహకారంతో పండగను ఘనంగా నిర్వహిస్తున్నామని భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరుతున్నారు.

సంక్షేమ పథకాలే ఎమ్మెల్సీగా సుధాకర్‌ను గెలిపిస్తాయి

ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



నాతవరంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

నాతవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపిస్తాయని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. నాతవరంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని ఆయన సోమవారం పరిశీలించారు, నాయకులకు కార్యకర్తలకు మనోధైర్యం కల్పించారు. రాష్ట్ర సృజనాత్మకత సాంస్కృతిక అండ్ క్రియేటివ్ హెడ్ జోగినాయుడు, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, పార్టీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, గన్నవరం, పి.కె.గూడెం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు గొర్లె వరహాలబాబు, అచ్చెర్ల వరహాలబాబు, సర్పంచులు కరక అప్పలరాజు, లగుడు నాగేశ్వరరావు, ఉలబాల శ్రీను, ఎంపీటీసీ సభ్యులు తమరాన సత్యనారాయణ, ఇపసప్పల పుష్ప, తమరాన లోవకృష్ణ, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు పాల్గొన్నారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన డిప్యూటీ సీఎం

దేవరాపల్లి: స్థానిక జెడ్పీ హైస్కూల్లోని రెండు పోలింగ్ కేంద్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు వైఎస్సార్‌సీపీ నాయకులను అడిగి తెలుసుకున్నారు.

గ్రామాల వారీగా మిగిలిన ఓటర్లను రప్పించడంపై దృష్టి సారించాలని సూచించారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, రొంగలి నారాయణమ్మ పాల్గొన్నారు.

నూకాంబిక గరగ ఊరేగింపు



గరగను దర్శించుకుంటున్న భక్తులు

కశింకోట : స్థానికంగా ప్రసిద్ధి చెందిన కశింకోట నూకాంబిక అమ్మవారి పుట్టుక మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మ వారి ఆలయం నుంచి గరగలు, అమ్మ వారి పాదాలను అందంగా అలంకరించిన రిక్షాలో నిలిపి సంప్రదాయంగా డప్పులతో గ్రామంలో ఊరేగించారు. ప్రజలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చారు. ఊరేగింపు అనంతరం గరగ, పాదాలను ఆలయంలో యథావిధిగా నిలిపారు.

గ్రామ పంచాయతీ కార్యాలయము, వడ్డాది

రేఖా నెం. 13/2023 తేది 13/03/2023

బహిరంగ వేలము మరియు టెండరు ప్రకటన

విశాఖపట్నం జిల్లా బుచ్చియ్యపేట మండలం, వడ్డాది గ్రామ పంచాయతీ 2023-2024 ఆర్థిక సం॥నకు ఈ దిగువ ఉదహరించిన (షెడ్యూలు -1 ప్రకారము) తే. 24-03-2023ది. శుక్రవారం ఉదయం 10:00 గంటల నుండి వడ్డాది గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బుచ్చియ్యపేట మండలం పంచాయతీల విస్తరణాధికారి (E.O.,P.R&RD) వారి సమక్షములో రోజు వారి మార్కెట్, వారపుసంత, కమేలా మరియు అదర్స్ లలో ఆసీలు వసూలు చేసుకొను హక్కునకు బహిరంగ వేలం నిర్వహించబడును. షెడ్యూలు -1లో ఉదహరించిన ప్రకారం దరావత్తు రూ. 2,50,000/-లు, మరియు రూ. 2,50,000/-లు కు శ్రీ మండల రెవెన్యూ అధికారి వారి మూడు నెలలలోపు గల మోతుబరి ధృవపత్రము సమర్పించి బహిరంగ వేలంపాటలో పాల్గొనవలెను. సదరు వేలం పాట ఖాయపర్చుటకుగాని, రద్దు పర్చుటకు గాని లేదా వాయిదా వేయుటకు గాని, ఈ దిగువ సంతకం దారునికి పూర్తి అధికారము కలదు.

షెడ్యూల్-1

వ.నెం.	టెండరు వివరము	ధరావత్తు	సమయము
1.	2023-2024 ఆర్థిక సం॥లో రోజువారి వారపు సంత, కమేలా మరియు అదర్స్ వద్ద ఆసీలు వసూలు చేసుకొను హక్కునకుగాను	2,50,000/- మరియు 2,50,000/- సాల్వెన్సీ లేక 2,50,000/- నగదు చెల్లించవలెను	తేది 24-03-2023 ఉదయం 10-00లకు

షెడ్యూల్-2

వ.నెం.	టెండరు వివరము	ధరావత్తు	సమయము
1.	2023-2024 ఆర్థిక సం॥ నకు పారిశుధ్య పనులు మరియు, రక్షిత మంచినీటి సరఫరా పనికి సరఫరా చేయుటకు గాను మనుష్యులను సప్లై చేయుటకు సీల్డు టెండరు ద్వారా స్వీకరించబడును.	2,000/-	తేది 25-03-2023 ఉదయం 10-00 గం॥ నుండి మధ్యాహ్నా 03:30 ని॥ వరకు
2.	2023-2024 ఆర్థిక సం॥ నకు పారిశుధ్య పనిముట్లు మరియు, పెనాయిలు, బ్లీచింగ్, పొడిసున్నము మరియు రక్షిత మంచినీటి సరఫరా విడిసామాన్లు సప్లై చేయుటకు గాను సీల్డు టెండరు ద్వారా స్వీకరించబడును.	2,000/-	

(షెడ్యూల్ -2 ప్రకారము) 1) తేది 25-03-2023 శనివారం ఉదయం 10-00గం॥ నుండి మధ్యాహ్నం 03:30. ని॥ వరకు ప్రజారోగ్య పారిశుధ్య సిబ్బంది కాంట్రాక్టు పద్ధతిపై లేబరును సప్లై చేయుటకు సీల్డు టెండర్లు తీసుకోబడును. (షెడ్యూల్ - 2 ప్రకారము) 2) అదే రోజు తేది 25-03-2023 ఉదయం 10-00 గం॥ నుండి మధ్యాహ్నం 03:30 ని॥ వరకు పారిశుధ్య పనిముట్లు మరియు పెనాయిలు, బ్లీచింగ్, పొడిసున్నము మరియు రక్షిత మంచినీటి సరఫరా విడిసామాన్లు సప్లై చేయుటకు గాను సీల్డు టెండరు ద్వారా స్వీకరించబడును.

షరతులు :

షెడ్యూల్ - 1

1) మార్కెట్ ఆసీలు పాట పాడదలచినవారు ధరావత్తు మరియు సాల్వెన్సీ చెల్లించినచో వేలం పాటకు అర్హులుగా గుర్తించబడును
2) ఆసీలు పాటలో పాల్గొను అభ్యర్థులు ప్రజలచే ఎన్నుకోబడినవారు వేలం పాటకు అనర్హులు.
3) ఈ గ్రామపంచాయతీనకు ఎటువంటి బకాయిలు ఉన్నా వేలం పాటకు అనర్హులు
4) పై చూపిన వివరములతో వేలం పాటకు హాజరు అవ్వవలెను.

షెడ్యూల్ - 2

1) పారిశుధ్య ప్రజారోగ్య పనులు చేయు కాంట్రాక్టు సిబ్బందికి విధి నిర్వహణలో ఏ విధమైన హాని జరిగినను అందుకు గ్రామ పంచాయతీ వారు ఎటువంటి బాధ్యత వహించరు.
2) పారిశుధ్య పనులు నిమిత్తము దాఖలు పడిన టెండర్లు మొత్తము పంచాయితీ వారు ఖాయపర్చిన తరువాత శ్రీ కలెక్టరు (పంచాయతీ వింగు) అనకాపల్లి వారు మంజూరు ఉత్తర్వులు ప్రకారం పేమెంట్ జరుపబడును.
3) వేలం పాటదారులుకు ఏమైనా సందేహములు ఉన్నయెడల ఈ గ్రామపంచాయతీ పనిదినాలలో వచ్చి తెలుసుకోవలెను.
4) బహిరంగ వేలం పాట మరియు టెండరు యొక్క వివరములు 5 ముఖ్యమైన కార్యాలయములలో నోటీసు బోర్డులో ప్రేలాడదీయడమైనది.

MVS. లవరాజు
పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-1, గ్రామపంచాయతీ,
వడ్డాది, బుచ్చయ్యపేట మండలము, అనకాపల్లి జిల్లా.